•

# హైటెక్ వ్యాపారం

"కాన్వెంటెట్టి సూడు కాసుల వొర్సం కురిపిత్తాది!"

"నాను సావెత సెవతన్నా ననుకునేవు అప్పల్నారీ! యాపారానికి ఆలోసన సెప్పమన్నావు సెవతన్నా!"

"నువ్వు సురుకైన వోడివి! సదూకుతోన్నడివి. పదిమందికి కూడు ఎట్టగల కెపేసిటీ గలోడివి! వుజ్జోగాల జోలుపోనేదు"

"పూరవం దనబలివి లేనోడు కుదురుగ్గా సదూకొని వుజ్జోగాలంటూ ఊర్లంట దిరిగేవోరు. ఉన్నోడెవడూ వుజ్జోగాల వూసెల్లేవోరుగాదు"

"మరి యీ పొద్దు ఆటికోసం ఎగబడని వోడు నేడు. అంచాత ఆటికి ఏలంపాట ఎట్టేసినారు. దనబలివి ఉన్నోడు ఆటిల జొరపడతన్నాడు ఎటుసూసినా ఐటెక్కు మగిమ!

"మట్టిల ఇత్తనాలు ఏసీగానే మొలకెత్తియాల! పూవు, పిందెట్టి పంటసేతల రావాల"

"యాపారంల మదుపులెట్టీగానే నాబాలు సేతికందాల!

"కాసులు గలగలరాలే ఐటెక్కు యాపారాలే ఈకాలంల పెజలకి గావాల"

నా ఎరికన అట్టాంటి కాసులురాలే ఐటెక్కు యాపారాలు రెండున్నాయి. ఓటీ సారా యాపారం! కాన్మెంటు సదువులు! పెజలకు యీ పొద్దు ఆటిమీదున్న మోజు ఏటికీ నేదు! పట్టనంల కూలోడు కూడ ఎసలుబాటున ఆడిపిల్లోడిని ఇంగ్లీసు సదువుకు తోల్తన్నాడు."



"నిచ్చరగా నా కల్లత సూసింది సేవతన్నాను"

మా సిన్నల్లుడు ఇజయసారది -నువు సూడనేదుకదూ?" ఆడు ఎమ్.ఎ సదివి, సదువుల డాట్టరు పట్టాపుచ్చుకున్నాడు తెలుసా? ఆడికి ఆడు సదివిన సోటే వుజ్జోగవిత్తనన్నారు! ఆడు నాను వుజ్జోగం సెయ్యనని మెడ్డేసినాడు.

"ఆడి యిసురుబాటుకు మావందరం నివ్వెరబోయినాం! అదేటి సిత్రం! యీ పొద్దు ఇంజనీరు సదివినా, డాట్టరు సదివినా, మేట్టరీ సదివినా జనాలు వుజ్జోగాలు నేక రోడ్డంట దిరుగుతన్నారు. మరి నువు సేతల సిక్కిన వుజ్జోగం వొగ్గేసినావేటని నిల్దీసినావు"

"నాను పట్నంల కాన్వెంటు యడతన్నాను! నానే పదిమందికి వుజ్జోగాలిత్తాను!

ఈ పొద్దు కాన్మెంటు సదువుల గిరాకీ మరేటికీ నేదు. పెతివోల్లు ఇంగ్లీసు సదువుల కెగబడతన్నారు! అయిసయాలు మీకు తెలవవు!"

"ఇంగ్లీసోడు మన్నొగ్గేసి ఎల్లిపోయినా ఆడిబాసని మనం ఒగ్గడంనేదు!"

"అంచాత కాన్మెంటెడితే కాసుల వొర్సం కురిపిత్తాది!" అన్నాడు.

ఆడిమాట నువు కాదన్నేవు!"

"ఈ పొద్దు అమ్మా! అయ్యా! అనడం నామోసీ! మమ్మీ! పప్పా అనడం పేసను"

"ఆటిని మరి కాన్మెంటుల నేర్పిత్తారు!"

గవొర్మెంటోల్లు యీదికో బడెట్టి సదువుకుందికి పిల్లలకి పుస్తకాలు, పలకలు, బలపాలు, యేనుగుందికి వూనీ పారంలు వుల్సాగా సప్లీచేసినా మద్దేన్నం బోజనవెడతావన్నా యీది బడి దుక్కు ఎవురూ సూడనేదు"

"ఈది బడికి గుంటల్ని దోలితే ఆల్లకి ఏటొత్తాది! ఆడ సదువు ఏటి సెవతన్నారు? బక్కల్ని రాతి పర్రమీదకు దోలుకెల్తే అవేటిమేత్తాయి?" అంతన్నారు జనాలు. అంచాత కాన్మెంటు సదువుకి ఎగబడతన్నారు"

"మా సిన్నల్లుడు పట్నంల ఎట్టిన కాన్మెంటు నానుపోయి సూసొచ్చినా! అల్లుడి పనితనవేటో? సంపాదనేటో తెలవాల గదా! లచ్చల సొమ్ము మదుపెట్టినాను గదా!

సూడ్డవేగాదు మా అల్లుడు అయివరాలు, మతలబులు నాకు సక్కగ బోదసేసినాడు! నాను సూసిందీ, ఇన్నదీ, గెహించిందీ నీకు సేవతన్నాను"

"కాన్మెంటు సదువుల యాపారానికి మదుపులు లవిన్నిగావాల!

"పెసారం సెయ్యాల! నువ్వెంత సెపారం చేసి వూర్ల పెజల్ని ఊదరగొడత అంత పెస్టేజి!

కాన్మెంటు ఎట్టడానికి సక్కని బవనం గావాలి. దానికి ముందూ యెనకా టూడెంట్లు మసల్డానికి లవింత సోటుండాల. గేటు కాడ వోచిమేను ఎట్టాల! మరి టూడెంట్లు కూకోడానికి, కూకొని రాసుకోడానికి సక్కటి బెంచి బల్లలుండాల! పెతీ గదిలోన పంకాలు, టూబులైట్లూ ఎట్టాల! నోవరుకేజీ, అప్పరుకేజీ పిల్లలు ఆడుకోడానికి

యిసాలవైన రెండుగదులు ఆటిల సక్కటి ఆటబొమ్మలు ఎట్టాల! అల్ల ఆలనా పాలన సూసేందుకు ఇద్దరు ఆయమ్మలుండాల! ఓం పెదమంగా వొచ్చినోల్లు నీ అంగు ఆర్భాటం సూసి డంగైపోవాల!

"కాన్మెంటు దెరవడానికి నెల్దినాల ముందలే అప్లికేషనన్లు అమ్మజూపాల! ఆటిదర నువ్వెంత ఎక్కువెడితే అంత పెస్టేజి!"

"పేస్టేజిత నువ్వెట్టిన డొనేసను పెతీవోరూ నవ్వుత గడతారు"

మరి టూడెంట్లకి గావొల్సిన పుస్తకాలు, పెనిసిల్లు, కలాలు, బేగులు, బేడ్జీలు, ఆటన్నిటి మీద నీ కాన్మెంటు పేరు అచ్చేయించి ఆటిని నువ్వే సప్లీసెయ్యాల! ఆటి మీద నీకు రూపాయికి రూపాయి నాబం! డొనేసన్లతనీ పెట్టుబడి మదువులు నీగల్లా పెట్టిల సేరిపోతాయి".

"ఇక సదువులు సెప్పడానికి టీచరమ్మల్ని యేసుగున్నావనుకో నీకు రెండిదాల నాబం! ఆరుపిల్లలకి సక్కగ, ఓపిగ్గ బోదసేస్తరు. అంతేకాదు సుట్టుపక్కల పిల్లలకి ఆరే నీకు కర్సునేకుండా పెసారం సేసి పిల్లల్ని దోలుకొత్తారు" నువు వోరం వోరం పిల్లల సదువుల రిపోర్టులు ఆల్లఅయ్యా, అమ్మలకు అంపితే నీ మీద ఆల్లకి గురి కుదురుద్ది"

ఇయన్నీ మా అల్లుడు సేసినాడు. నాను సూసినాను. ఈ పొద్దు ఆడి కాన్మెంటుల సేర్పించడానికి జనాలు ఎగబడతన్నారు. ఎంత డొనేసను ఎట్టినా కడతావంతన్నారు. అంచాత పెతీ తరగతీ రెండేసి సెచ్చన్లు ఎడతాను అంతన్నాడు. తరగతికి నలభైమంది సొప్పున పది తరగతులకీ నాలుగొందల మంది పిల్లల్ని ఎగస్టాగా తీసుగోవొచ్చు"

"సొమ్ముకేటి? ఎట్టాగేనా ఒత్తాది! గాని నేను ఒంటరిగా అన్నీ సూసుకోనేక నలిగిపోతన్నాను. నాకు పెస్తుతం మడిసిసాయంగావాల! తగినాతుగ్గ ఆపీసుల గూకొని పెత్తనం సేసేమనోడుండాల! అంతన్నాడు. యీ వోయిసుల అది నా వొల్లగాదు. ఆ బారం నీమీదిడుకుని ఆడియోపారంల జతగూడు! నీ కాడున్న సొమ్ము రెండు లచ్చలూ నీ బాగంగ మదువులెట్టు! నీకు అనుమానం, అబ్బెంతరం అయితే సెప్పు బయంనేదు పూర్ల మా బాగార్ల కుర్రాడే సంచిల సొమ్మట్టుగుని రడీగా కూకున్నాడు!"

"నువ్వెట్టిన సొమ్ముకి మొప్పంరాదు! గావాలంటే నాను ఆమీ ఇడతాను సరేనా"

"అదీ తెగింపు! బుద్ధిమంతుల లచ్చనం! రేపు పెందిల సొమ్మట్టుకొనిరా! నానూ నీ కూడ బయలెల్లి మా సిన్నల్లుడికి నిన్ను వప్పగింతెడతా! కారుల బయలెల్దాం! ఆఁ! అట్టాగే! సుబం ఎల్లిరా!"

"బావూ! సెలవయ్యగోరూ! సిన్నల్లుడు గోరు రెండు లచ్చల సొమ్ము అరజంటుగా కావాలని కబురం పేరు."

"తవరు అప్పల్సారిగోరికి కాన్మెంటు ఎట్టిసూడు కాసుల వొర్సం కరిపిత్తాది' అని ఐటెక్కు యాపారం అరసేతల సూపి ఆరికాడ వొడ్డీలేని మదుపులు రెండు లచ్చలు సిటంల రాబట్టేసినారు ఐటెక్కు పెసారం సేసి" అన్నాడు సీమ్మన్న నివ్వెరపోయి.

('సుప్రభాతం వీక్లీ', ఆగస్టు 2001) ✪